# శాసన స్వరూపం - వస్తువు

డా. జి. అరుణకుమారి.

ఏ దేశ చరిత్రనైనా పునర్మించటానికి శాసనాలు ప్రధాన ఉపకరణాలుగా నిలుస్తున్నాయి. శాసనం అంటే రాజాజ్ఞ అని, పత్రం మీద పెట్టబడిన ఆజ్ఞ అని, స్థిర స్థాయిని పొందిన ఆజ్ఞ అని అర్థం.

పూర్వ కాలంలో శాసన నిర్మాణ క్రమంలో కొన్ని నియమిత పద్ధతులను పాటించారు.

1. రాజాజ్ఞ
2. శాసన అధికారి లేదా లేఖకుడు, శాసన సంరక్షకుడు
3. శాసన ప్రకటన

అని మూడు దశలుగా శాసన నిర్మాణం కనిపిస్తుంది. రాజాజ్ఞను ఆకుపైగానీ, బెరడుపైగాని, వస్త్రంపైగాని లిఖితపూర్వకమైన ఆజ్ఞగా చేసి అధికారి మూలంగా గానీ లేఖకుని మూలంగా గాని స్థిర రూపాన్ని ధరించిన శాసన లోహన్ని బట్టి శాసనాలను మూడు రకాలుగా గుర్తించారు. **రజత, తామ్ర, శిలా శాసనాలు**. మహాసంధి విగ్రహిక లేక రహసిక అనే శాసన సంరక్షకుడు లేదా దూతగాని, అక్షపటలిక దివిరపతి అను శాసన సంరక్షకుడు గాని, అమాత్యుని ఆజ్ఞను అనుసరించి వెండి రేకులపై వేసే శాసనాలను రజత శాసనాలని అంటారు. ఈ లోహంపై వేసే శాసనాలను వేళ్ళమీద లెక్క పెట్టవచ్చు. విజయ రాఘవ నాయకుడు వేయించిన 'పొలందారి' రజత శాసనాన్ని దీనికి ఉదాహరణగా పేర్కొనవచ్చు.

2. రాగి రేకులపై వేసే శాసనాలను తామ్ర శాసనాలని అంటారు. ఇవి వందల సంఖ్యలో మాత్రమే కనిపిస్తున్నాయి. విష్ణుకుండినుల కాలంలో తామ్ర శాసనాలు లభ్యమయ్యాయి. గోవింద వర్మ వేయించిన ఇంద్రపాల నగర తామ్రశాసనం దీనికి ఉదాహరణగా నిలుస్తుంది.

3. రాతి పలకలపై వేయటం వలన వీటికి శిలాశాసనాలని పేరు. ఇవి వేల సంఖ్యలో కనిపిస్తాయి. బౌద్ధుల గుహాశాసనాలు, శాతవాహనులు, శాలంకాయనులు సుమారుగా అన్ని కాలాలలోను కనిపించేవి శిలాశాసనాలు.

ఇవేగాక నాణాలు, మట్టి పాత్రలపై ఉన్న చిత్రలిపులు, ముద్రలు కూడ చరిత్రకు ఆధారాలుగా నిలుస్తాయి.

ప్రారంభంలో శాసన వస్తువు సంక్షిప్తంగా ఉండి కాల క్రమేణ విస్తృతి పెరిగింది. శాసన బాహ్య స్వరూపాన్ని చూసినట్లయితే శాసనంలో ప్రధానంగా **ప్రస్తావన, ప్రకటన, ఉపసంహారం** అనే మూడు విభాగాలు కనిపిస్తాయి.

- ప్రస్తావనలో మంగళవాచకం, శాసనకాలం, స్థలం, దాత ప్రశస్తి కనిపిస్తాయి..
- ప్రకటనలో దాన విషయం, గ్రహీతపేరు, దాన లక్ష్యం, దాన పరిమాణం ఉంటాయి.
- ఉపసంహారంలో అభ్యర్థన, శాపం, ఆశీస్సులు, మంగళాశాసనం, వంశకీర్తి, లేఖకుని పేరు కనిపిస్తాయి.

శాసన బాహ్య అంతర్ స్వరూపాన్ని రూప పరంగా గమనించాం. శాసనాన్ని వస్తు పరంగా భిన్నదృక్పథాలతో పరిశీలించినట్లయితే మనం ఈ విషయాలను గమనించవచ్చు.

వసిష్ఠుడు స్మృతిచంద్రికలో శాసనాలను రెండు రకాలుగా విభజించాడు. అవి. **లౌకికం, రాజకీయం**. పరాభిలేఖా శాస్త్రజ్ఞులు కూడ దీనినే పాటిస్తున్నారని చెప్పవచ్చు. వస్తువును ఆధారంగా చేసుకుని శాసనాలను 13 రకాలుగా వర్గీకరించారు.

1. దానాలకు సంబంధించినవి **దాన శాసనాలు**. (రేనాటి చోళ ఎఱికల్ ముత్తురాజు శాసనం).
2. వంశ ప్రశస్తికి సంబంధించినవి **ప్రశస్తి శాసనాలు**. (రామేశ్వరం శాసనం)
3. యుద్ధవీరుల స్మృత్యర్థం వేయించిన వీర గల్లులు **జ్ఞాపిక శాసనాలు.**

4. క్రియా విషయిక సంబంధమైనవి **క్రియా శాసనాలు** (దేవగుడి, దనిపెంట శాసనం)

5. అంటు రోగాలు ప్రబలినపుడు తంత్ర ముద్రలతో వేసినవి **తాంత్రిక శాసనాలు**. (పొత్తపి, బుక్కాయపల్లి శాసనం).

6. వంశ పారంపర్య సంపదకు సంబంధించినవి **కాణాపకమ్మ శాసనాలు**(చిడుపర్తి శాసనం)

7. ద్రవ్య వినిమయానికి సంబంధించినవి **వినిమయ శాసనాలు**(సంబటూరు శాసనం)

8. బలికి సంబంధించినవి **పొలివూటు శాసనం**(నందలూరు శాసనం)

9. అధికారుల తప్పిదం వలన గ్రామస్థులు ఇబ్బందిపడి రాజుకు ఫిర్యాదు చేయగా తిరిగి ఆ పొరపాటు జరిగదని తెలిపేది **నమ్మిక శాసనం** (పులివెందుల శాసనం)

10. ఒకరికి నిర్వహణ బాధ్యత అప్పగించి ప్రతిగా వారికి ధనరాశినిగాని, భూమిగాని ఇచ్చినట్లు తెలిపేది **దశబంధ శాసనం**(పెండ్లి మట్టి శాసనం)

11. వృత్తి పని వారి వేళలను గురించి తెలిపేది **సమయకమ్మ శాసనం**(కమలాపురం శాసనం)

12. ఆస్తిలోని భాగాలను గురించి తెలిపేది **పాళ్ళకమ్మ శాసనం**(చిడుపర్తి, కమలాపురం శాసనం).

13 **చిడికల్లు శాసనం** – దీనిని గురించిన వివరాలు స్పష్టంగా తెలియవు. ఈ పేర్లన్నీ శాసనాలలో లిఖిత పూర్వకంగా కనిపిస్తాయి.

శాసనంలోని వస్తువును ఆధారంగా చేసుకొని ఆధునికులు శాసనాలను ఈ విధంగా వర్గీకరించారు.

1. దేవాలయాలకు, మత సంబంధమైన వాటికి, బ్రాహ్మణులకు ఇచ్చే భూదానాలను తెలియజేసే శాసనాలు **దాన శాసనాలు**.

2. భారతీయ సంప్రదాయంలో ధర్మాన్ని జీవన విధానంగా గుర్తించారు. దేవాలయ నిర్మాణాలను ధార్మిక క్రియగా గుర్తించారు. రాజులు వారి వారి పేర్లతో ఈశ్వరాలయాను నిర్మించారు. కృష్ణరాయలు మల్లేశ్వర దేవాలయానికి ముఖమండప నిర్మాణం చేపట్టడం ధర్మ క్రియగా పేర్కొన్నాడు. ప్రజలకోసం న్యాయన్యాయాలను, తీర్పు, వివాహం వంటి విషయాలలో ధర్మతీర్పులు వస్తువుగా చేసుకుని వేసేవి **ధర్మశాసనాలు.**

3. భూమికి కొన్ని పరిమితులు విధించి పొలిమేరలను నిర్ణయించి చూపించేవి**పొలిమేర శాసనాలు.** రెండు గ్రామాల మధ్యగాని, సంస్థల మధ్యగాని సరిహద్దును నిర్ణయించటం శాసనాలలో కనిపిస్తుంది. దీని వలన భూమి వివరాలు, విస్తీర్ణం తెలుస్తుంది.

4. వస్తు విక్రయంలోను, పనులు నిర్వర్తించే సందర్భంలోను చేసుకునే ఒప్పందాలను తెలియజేసేవి **ఒప్పంద శాసనాలు**.

5. ఆర్థిక పరమైన విషయాలను వివరించేది **ఆర్థిక శాసనాలు**. పన్నులను విధించటం, భూమిపై వచ్చే ఆదాయం, పంటపై వచ్చే ఆదాయం, ఇతర పన్నుల విధి, విధానాలకి సంబంధించిన విషయాలను సూచించేవి ఆర్థిక శాసనాలు. కొన్ని వర్ణాల వారికి రద్దు చేస్తూ శాసనాలు వేయించారు.

6. రాజుల దండయాత్రలను, విజయాలను, రాజుల ఓటమిని, మరణాన్ని వివరించేవి **యుద్ధ శాసనాలు**.

7. రాజుల పేరు ప్రతిష్టల కోసం చేపట్టే తటాక నిర్మాణాలు, ప్రజావసరాల కోసం చేపట్టే పనులను తెలియజేసేవి **ప్రజాహిత శాసనాలు**. రాజులతో పాటు ఇతరులు కూడ చెరువులు, తటాకాలు, ఆనకట్టలు తవ్వించారు, నిర్మించారు. బాటసారులకు చలువ పందిళ్ళు వేయించారు.

**గ్రంథసూచి:**

1. డా॥అవధానం ఉమామహేశ్వర శాస్త్రి – కడప జిల్లా శాసనాలు – సంస్కృతి చరిత్ర